## మానవత్వం చాటుకున్న మాజీ ఎమ్మెల్యే



బోల్తాపడ్డ ఆటోను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య

బెల్లంపల్లి, అక్టోబర్ 27 : రోడ్డు ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులను వెంటనే దవాఖానకు పంపించి బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య మానవత్వాన్ని చాటుకున్నారు. రామకృష్ణాపూర్ మండలం బొక్కలగుట్ట వద్ద ఆదివారం ప్రమాదవశాత్తు ఆటోబోల్తా పడింది. దీంతో అందులో ప్రయాణిస్తున్న పలువురికి గాయాలయ్యాయి. అటువైపుగా వెళ్తున్న మాజీ ఎమ్మెల్యే స్పందించి వెంటనే వారి దగ్గరికి వెళ్లి పరిశీలించారు. వెంటనే 108కు ఫోన్ ద్వారా సమాచారం అందించి దవాఖానకు పంపించారు.

## ఘనంగా గంగామాత ఉత్సవాలు

బెజ్జూర్, అక్టోబర్ 27 : మండల కేంద్రంలోని మత్స్యకారుల కాలనీలో ఐదు రోజులుగా గంగా మాత ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ ఉత్సవాల్లో ఎమ్మెల్సీ దండే విఠల్ ఆదివారం పాల్గొని ప్రత్యే పూజా కార్యక్రమాలను నిర్వహించారు. గంగామాత ఉత్సవాల ముగింపు కార్యక్రమంలో పాల్గొనాడానికి వచ్చిన ఎంఎల్సీకి మత్స్యకారులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన గంగా మాతకు పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో చింతలమానేపల్లి మాజీ ఎంపీపీ నానయ్య, టీపీసీసీ మెంబర్ అర్సద్ హుస్సేన్, పీఏసీఎస్ చైర్మన్ ఓం ప్రకాశ్, కాంగ్రెస్ నాయకులు శ్రీవర్ధన్, నహీర్ అలీ, రాజన్న, సురేశ్ గౌడ్, మత్స్యకారుల సంఘం అధ్యక్షుడు సూర్ల ఇస్తారి, కుల పెద్దలు బాలయ్య, బిచ్చయ్య, పోషయ్య, భీమయ్య, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి క్రీడాపోటీలకు విద్యార్థినుల ఎంపిక

ఆసిఫాబాద్ టౌన్, అక్టోబర్ 27: జిల్లా కేంద్రంలోని గిరిజన ఆదర్శ క్రీడా పాఠశాల నుంచి ఏడుగురు రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జంగు ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 28 నుంచి 30వ తేదీ వరకు మహబూబ్‌నగర్‌లో జరగబోయే 43వ రాష్ట్రస్థాయి జూనియర్ బాలబాలికల ఖోఖో పోటీల్లో పాల్గొననున్నట్లు జిల్లా స్పోర్ట్స్ అధికారి మీనారెడ్డి తెలిపారు. రాష్ట్రస్థాయిలో మంచి ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి ఎంపిక కావాలని డీడీ రమాదేవి ఆకాంక్షించారు. ఏసీఎంవో పీ ఉద్ధవ్, జీసీడీవో శకుంతల, కోచ్‌లు అరవింద్, తిరుమల్, విద్యాసాగర్, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ సాయిబాబా, ఉపాధ్యాయులు అభినందించారు.

## శ్మశాన వాటికను కబ్జా చేస్తే ఊరుకునేది లేదు

మందమర్రి, అక్టోబర్ 27: మందమర్రి పట్టణంలోని కేకే ఓసీ సమీపంలో గల శ్మశాన వాటికను కబ్జా చేస్తే ఊరుకునే ప్రసక్తి లేదని యాపల్ ప్రాంత వాసులు హెచ్చరించారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. నాలుగు నెలల క్రితం ఒక వ్యక్తి ట్రాక్టర్లతో శ్మశాన వాటికను చదును చేయడంతోపాటు పలు స్మారక కట్టడాలను తొలగించారని తెలిపారు. దీంతో యాపల్, అంగడిబజార్ ఏరియాల్లోని 8 వార్డులకు చెందిన ప్రజలు పోలీసులకు ఫిర్యాదు చేయగా పనులను నిలిపివేశారని తెలిపారు. రానున్న రోజుల్లో శ్మశాన వాటికను ఎవరు కబ్జా చేసినా ఊరుకునేది లేదని హెచ్చరించారు. సమావేశంలో ఆయా వార్డుల వాసులు వనం నర్సయ్య, బోరిగం వెంకటేశ్, రాచర్ల రవికుమార్, రాకేశ్, రాచర్ల గణేశ్, జక్కని సత్యం, సారంగపాణి, సంతోశ్, కుమార్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# నెలకోసారి ప్రజాదర్బార్ నిర్వహించాలి

- మున్సిపల్ సమావేశంలో ఎమ్మెల్యేకు సూచించిన కౌన్సిలర్



మున్సిపల్ సమావేశంలో ఎమ్మెల్యే గడ్డం వినోద్, కలెక్టర్ కుమార్‌దీపక్

బెల్లంపల్లి, అక్టోబర్ 27 : బెల్లంపల్లిలో కనీసం నెలకొకసారైనా ప్రజాదర్బార్ నిర్వహించి ప్రజల సమస్యలను దగ్గరుండి తెలుసుకోవాలని కౌన్సిలర్ దామెర శ్రీనివాస్ ఎమ్మెల్యే గడ్డం వినోద్‌కు విన్నవించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత అధ్యక్షతన ఆదివారం సాయంత్రం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన మున్సిపల్ సాధారణ సమావేశంలో కలెక్టర్ కుమార్‌దీపక్, ఆర్డీవో హరికృష్ణతో కలిసి ఎమ్మెల్యే గడ్డం వినోద్ హాజరయ్యారు. కౌన్సిలర్ మాట్లాడుతూ, చాలా కిలోమీటర్ల దూరం నుంచి వారంలో రెండు, మూడు సార్లు వస్తున్నా ముఖ్య నాయకులే వెంబడి ఉండడంతో సామాన్యులు తమ సమస్యలు చెప్పుకోవడంలో ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. నెలకు ఒకసారి నియోజకవర్గంలోని ప్రధాన అధికారులతో కలిసి ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలపై దృష్టిసారించాలని కోరారు. ఇందిరమ్మ కమిటీల్లో కూడా కౌన్సిలర్లకు ప్రాధాన్యం ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపాలిటీ పరిధిలో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

### రోడ్డు పనులకు భూమిపూజలు

తాండూర్, అక్టోబర్ 27 : తాండూర్ మండలం బోయపల్లి నుంచి గొండగూడెం గ్రామం మీదుగా బుగ్గ దేవాలయం వరకు ఐటీడీఏ నిధులు రూ.2.60 కోట్లతో చేపట్టనున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులను ఆదివారం అధికారులు, నాయకులతో కలి సి ఎమ్మెల్యే గడ్డం వినోద్ భూమిపూజ చేశారు. ఇక్కడ అధికారులు, నాయకులున్నారు.

నెన్నెల, అక్టోబర్ 27 : మన్నెగూడెం నుంచి కోనంపేట వరకు రూ. రెండు కోట్ల 43 లక్షలతో చేపట్టనున్న బీటీరోడ్డు నిర్మాణ పనులను బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ కొబ్బరి కాయకొట్టి పనులు ప్రారంభించారు. అనంతరం మన్నెగూడెం గ్రామంలోని మండల ప్రాథమిక పాఠశాల ప్రహరీ పనులను శంకుస్థాపన చేశారు. ఇక్కడ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు గట్టు మల్లేశ్, మాజీ ఎంపీటీసీలు హరీశ్‌గౌడ్, శిరీష, నాయకులున్నారు.

బెల్లంపల్లి, అక్టోబర్ 27 : మండలంలోని శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయానికి బోయపల్లి నుంచి గోండుగూడెం మీదుగా నూతన రోడ్డు నిర్మాణ పనులను ఎమ్మెల్యే గడ్డం వినోద్ ప్రారంభించారు. రూ. రెండు కోట్ల 60 లక్షల నిధులతో చేపట్టిన పనులకు ఆదివారం ఆయన కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర ప్రచార కమిటీ జాయింట్‌కన్వీనర్ నాతరి స్వామి, తాండూర్, బెల్లంపల్లి మండల నాయకులు పాల్గొన్నారు. అలాగే, పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాలను విడుదల చేయాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ నాయకులు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే వినోద్‌కు వినతిపత్రం సమర్పించారు.

## జాతర పోస్టర్ల విడుదల



కంకలమ్మ జాతర పోస్టర్లను విడుదల చేస్తున్న కమిటీ సభ్యులు

కౌటాల, అక్టోబర్ 27 : స్వయంభూ శ్రీ కంకలమ్మ కేతేశ్వర ఆలయ జాతర ఉత్సవాల పోస్టర్లను ఆదివారం విడుదల చేశారు. డిసెంబర్ 1, 2 తేదీల్లో కంకలమ్మ జాతర మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ వ్యవస్థాపక చైర్మన్ సుల్వ కనకయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం ఆలయ ప్రాంగణంలోని ఎర్ర పోచమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

### నూతన కమిటీ ఎన్నిక..

కంకలమ్మ ఆలయ నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడిగా సుల్వ కనకయ్య, గౌరవాధ్యక్షుడిగా బసార్కర్ విశ్వనాథ్, కన్వీనర్‌గా రామయ్య, అధ్యక్షుడిగా ఉపుల సత్తయ్య, ప్రధాన కార్యదర్శిగా అల్లాడి రాములు, కోశాధికారిగా మహుల్‌కార్ లహను, ప్రచార కార్యదర్శిగా రాపాల శ్రీనివాస్, కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పలువురు నాయకులున్నారు.

## బాల్య మిత్రురాలికి బాసటగా..

దండేపల్లి, అక్టోబర్27: దండేపల్లి మండల కేంద్రానికి చెందిన వేముల సుమలత అనారోగ్యం బారిన పడింది. నిరుపేద కుటుంబం కావడంతో 1998-99 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన బాల్య మిత్రులు తనతోపాటు చదువుకున్న సుమలత కుటుంబానికి అండగా నిలిచారు. అనారోగ్యంతో బాధపడుతున్న మిత్రురాలికి రూ. 21,116 వేల ఆర్థిక సహాయం అందించారు. ఇక్కడ బాల్య మిత్రులున్నారు.

## సీపీఐ శత జయంత్యుత్సవాలను ఘనంగా నిర్వహించాలి

తాండూర్, అక్టోబర్ 27 : సీపీఐ శత జయంత్యుత్సవాలను ఘనంగా నిర్వహించాలని మంచిర్యాల జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలోని భగత్‌సింగ్ భవన్‌లో సీపీఐ కౌన్సిల్ సమావేశం బయ్యి మొగిలి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు మిట్టపల్లి వెంకటస్వామితో కలిసి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎన్నికలకు ముందు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. అనంతరం తాండూర్ సీపీఐ నూతన కమిటీని ఎన్నుకున్నారు. సీపీఐ మండల కార్యదర్శిగా సాలిగామ సంతోష్, సహాయ కార్యదర్శిగా నరాల ప్రహ్లాద్, మలిశెట్టి సత్యనారాయణ, ఆర్గనైజింగ్ సెక్రటరీగా వాసాల సాగర్, కోశాధికారిగా పట్టి శంకర్‌ను ఎన్నుకున్నారు. కౌన్సిల్ సభ్యులుగా 21 మంది, కార్యవర్గ సభ్యులుగా 11 మందిని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కామెర మల్లయ్య, నాయకులు కొండు బానేశ్, ఆడెపు రాజమౌళి, బొంతల లక్ష్మీనారాయణ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలి

మందమర్రి, అక్టోబర్ 27: పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి జాతీయ నాయకులు పెద్దపల్లి సత్యనారాయణ, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సొతుకు సుదర్శన్ కోరారు. మందమర్రి పట్టణంలోని పాత బస్టాండ్ చౌరస్తాలో ఆదివారం పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ పరిధిలోని వివిధ వార్డులకు చెందిన 150 మంది విద్యావంతులు ఓటరు జాబితాలో నమోదు కోసం దరఖాస్తులను సమర్పించారు. కార్యక్రమంలో మార్త కుమారస్వామి, ముల్కల్ల రాజేంద్రప్రసాద్, రాంటెంకి దుర్గరాజ్, సాదుల విద్యాసాగర్, అఫీస్, శంకరయ్య, చంద్రకాంత్, రాజు, లక్ష్మణ్, సతీశ్, ముజాహిద్ తదితరులు పాల్గొన్నారు.

## అనారోగ్యంతో ఎస్జీటీ మృతి

సిర్పూర్(యు), అక్టోబర్27: మండల కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలలో ఎస్జీటీగా విధులు నిర్వహిస్తున్న వడ్లూర్ శుశీల్(31) ఆదివారం మృతి చెందారు. ఆయన కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం. వారం రోజుల క్రితం శుశీల్ అనారోగ్యానికి గురికావడంతో ఆదిలాబాద్ దవాఖానలో చికిత్స చేయించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు హైదరాబాద్‌లోని నిమ్స్ హాస్పిటల్‌కు తరలించారు. అక్కడ నాలుగు రోజుల పాటు వైద్యం అందించినప్పటికీ నయం కాకపోవడంతో ఆదివారం ఉదయం మృతి చెందాడు. మృతునికి భార్య జ్యోతి, ఇద్దరు కూతుళ్లున్నారు.

## వృద్ధాశ్రమంలో అన్నదానం

సీసీసీ నస్పూర్, అక్టోబర్ 27: సీసీసీ టౌన్‌షిప్‌లోని శ్రీసాయి అనాథ వృద్ధాశ్రమంలో ఆళ్ల సుజాతలచ్చిరెడ్డి దంపతులు అన్నదానం చేశారు. తమ మనవరాలు తన్వికరెడ్డి కర్ణవేదన సందర్భంగా అన్నదానం చేయడం సంతోషంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేని శంకర్, నస్పూర్ పట్టణ కార్యదర్శి మిర్యాల రాజేశ్వర్‌రావు, కుటుంబ సభ్యులు ఆళ్ల పద్మరాజిరెడ్డి, దగ్గుల రఘునాథరెడ్డిఅమూల్య, మంజుల, మణికంఠరెడ్డి, రిచిత్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక సాయం అందజేత



శ్యాంకుమార్‌కు సాయం అందజేస్తున్న ఆత్మీయ ట్రస్ట్ సభ్యులు

మంచిర్యాల అర్బన్, అక్టోబర్ 27: మంచిర్యాల జిల్లా ఏసీసీ ప్రాంతానికి చెందిన దంపతులు చేతి శ్యాంకుమార్ శైలజ రెండో కుమారుడు దుర్గవరుణ్ ప్రమాదవశాత్తు వేడి సాంబార్ గంజులో పడిపోయాడు. ఒళ్లంతా కాలడంతో ప్రైవేటు దవాఖానలో చేర్పించి చికిత్సను అందిస్తున్నారు. నిరుపేద కుటుంబం కావడంతో దాతలు సహకరించాలని వేడుకుంటున్నారు. ఆదివారం ఆత్మీయ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.20 వేలను ఆర్థిక సాయంగా అందజేశారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు సట్ల మహేందర్, అధ్యక్షుడు తిరుపతి, సభ్యులు పాల్గొన్నారు.

## కార్మిక నాయకుడిగా మురళీధర్‌రావు గుర్తింపు

కాసిపేట, అక్టోబర్ 27 : కల్వకుంట్ల మురళీధర్ రావు కార్మిక నాయకుడిగా గుర్తింపు పొందారని, కార్మిక నాయకుడిగా అనేక సేవలందించారని మాజీ జడ్పీటీసీలు శరత్ చందర్ రావు, రౌత్ సత్తయ్య పేర్కొన్నారు. ఆదివారం కాసిపేట మండలంలోని ముత్యంపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు, కార్మిక నాయకుడు కల్వకుంట్ల మురళీధర్ రావు ఇటీవల మృతి చెందగా దశ దినకర్మకు పలువురు నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఓరియంట్ సిమెంట్ కార్మిక నాయకుడిగా ప్రత్యేక గుర్తింపు పొందారన్నారు. ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో శ్రీరామ్ రావు, మాజీ జడ్పీటీసీ పల్లె చంద్రయ్య, మాజీ వైస్ ఎంపీపీ పూస్కూరి విక్రమ్ రావు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రమణారెడ్డి, నాయకులు జగన్ మోహన్‌రావు, మదన్ మోహన్‌రావు, వంశీకృష్ణ రావు, రవీందర్ రావు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు లంక లక్ష్మణ్, రాంటెంకి వాసుదేవ్, మాజీ సర్పంచ్ ఆడె బాదు తదితరులు పాల్గొన్నారు.


